క్లుప్తంగా

తిరుమలకు పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న భక్తులు

లింగాల : మండల కేంద్రమైన లింగాల నుంచి తిరుమలకు సోమవారం వేంకటేశ్వరస్వామి భక్తులు పాదయాత్ర చేపట్టారు. వేంకటేశ్వర స్వామి భక్తుడు శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 20మంది మహిళలు, వృద్ధులు పాదయాత్రగా తిరుమలకు బయలుదేరారు. శనివారం రోజున తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ప్రతి ఏటా తిరుమలకు పాదయాత్ర చేయడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ ప్రధానం



గౌరవవందనం స్వీకరిస్తున్న డీఎస్పీ

ముద్దనూరు: ప్రజల శాంతి భద్రతల పరిరక్షణే ప్రధానమని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌లో తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. మండలంలోని ఎన్ని ఫ్యాక్షన్ గ్రామాలున్నాయి.. సమస్యాత్మక గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అక్రమ నగదు, అక్రమ మద్యం నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ దస్తగిరి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో సత్తా



విద్యార్థులతో కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి

వేంపల్లె : జాతీయస్థాయి నృత్యోత్సవ పోటీల్లో వేంపల్లె శ్రీచైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు నంది అవార్డులు కైవసం చేసుకున్నారని ఆ పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణిరెడ్డి తెలిపారు. ఈనెల 7వ తేదీన రాజమహేంద్రవరంలో శ్రీ వెంకటేశ్వర ఆనంద కళా కేంద్రంలో శ్రీ శివసాయి కూచిపూడి కళాక్షేత్రం వారు నిర్వహించిన జాతీయస్థాయి నృత్యోత్సవ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఎ.మనస్విత, కె.హిమబిందు, ఎస్.సిద్ధలక్ష్మి, ఎస్.అనిత, సి.గంగా వెన్నెల, ఎ.గణేష్, టి.బద్రీనాథ్, బి.బాలయోగి, ఎస్.సైఫుల్లాలు అద్భుతమైన ప్రతిభను కనబరిచి నంది అవార్డులు దక్కించుకున్నారని తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్, మేనేజింగ్ డైరెక్టర్లు చేతన్ రెడ్డి, చైతన్య రెడ్డి, నాట్య గురువు చిన్న అభినందించారు.

ఓబులంపల్లెలో రెవెన్యూ సదస్సు



రెవెన్యూ సదస్సులో అర్జీ స్వీకరిస్తున్న అధికారులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కె.ఓబులంపల్లెలోని సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముగ్గురు భూ సమస్యలపై అర్జీలు పెట్టుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఓబులంపల్లి రైతులకు తమ భూములకు సంబంధించిన ఎఫ్ఎంబీలు ఎక్కడ అందుబాటులో లేనందున ఓబులంపల్లె గ్రామాన్ని త్వరగా రీసర్వే చేసి ఎఫ్ఎంబీలను తయారు చేయాల్సి ఉంది. మంగళవారం రాయలపంతులపల్లె గ్రామానికి సంబంధించిన భూముల సమస్యలపై రెవెన్యూ సదస్సును రాయలపంతులపల్లెలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో రెవెన్యూ అధికారులు నిర్వహించనున్నారు.

నివాళి

కమలాపురం: వైఎస్సార్ సీపీ నాయకురాలు చిన్నక్కకు మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి నివాళి అర్పించారు. మండల పరిధిలోని టి.చదిపిరాళ్లకు చెందిన చిన్నక్క ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సోమవారం మృతురాలి నివాసానికి చేరుకుని చిన్నక్క మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలం ఓబులంపల్లె మాజీ సర్పంచ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ముండ్ల సుధాకర్ రెడ్డి అంత్యక్రియలు ఓబులంపల్లెలో సోమవారం జరిగాయి. ఈ అంత్యక్రియల్లో వైఎస్సార్ సీపీ నేత, ఏపీఎస్ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పేరు మార్చారు.. నిధులు మరిచారు!



ఆధునిక హంగులతో నిర్మించిన వేంపల్లె జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల



నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల భవనం

- మనబడి నాడు- నేడుకు నిధులు నిలిపివేత
- ఆగిన అదనపు భవన నిర్మాణాలు
- విద్యార్థులకు తప్పని అవస్థలు

వేంపల్లె : ఈ ఫొటోలో ఉన్న భవనం చూసి ఏ ప్రైవేట్ కళాశాల భవనం అనుకుంటే మీరు పొరపాటు పడినట్లే. ఎందుకంటే ఈ భవనం వేంపల్లె పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నూతన తరగతి భవనాలు. రూ.8 కోట్లతో అన్ని హంగులతో నిర్మించారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు ఇచ్చిన ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.

ఆచరణలో విఫలం

కూటమి ప్రభుత్వం మాటలకు, చేతలకు పొంతన కుదరడంలేదు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని చెబుతూనే వాటికి సంబంధించిన నిధులను ఆపివేసింది. దీంతో పాఠశాల అదనపు భవన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సర్కార్ బడుల్లో విద్యా సంస్కరణలలో భాగంగా నాడు- నేడు కార్యక్రమం ద్వారా పాఠశాల భవన నిర్మాణాలకు రెండు విడతలుగా కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి పనులను కొనసాగించింది. ఇంతలో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మనబడి నాడు- నేడు కార్యక్రమం పేరును మనబడి - మన భవిష్యత్తుగా మార్చింది. అయితే ఈ కార్యక్రమానికి నిధులు విడుదల చేయకపోవడంతో అదనపు తరగతి గదుల భవన నిర్మాణాలు నిలిచిపోయాయి. ఆచరణలో కూటమి ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు వస్తున్నాయి.

ఆగిన నిర్మాణాలు

మండలంలో మొత్తం 54 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 43 ప్రాథమిక పాఠశాలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలు, 6 ఉన్నత పాఠశాలు ఉన్నాయి. అందులో దాదాపుగా 4,663 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు -నేడు మొదటి విడతలో భాగంగా 25 పాఠశాలలను ఎంపిక చేసి రూ.4.93 కోట్లతో నిర్మాణాలు పూర్తి చేసింది. రెండో విడతలో భాగంగా 29 పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ భవన నిర్మాణాలు మరమ్మతులకు రూ. 5.87 కోట్లు నిధులు కేటాయించింది. ఇందులో కొన్ని భవనాలు పూర్తయ్యాయి. మరికొన్ని భవనాలు శ్లాబ్ దశలో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం నిధులు నిలిపివేయడంతో అసంపూర్తిగా మిగిలాయి. దీంతో అదనపు గదులు పూర్తికాక, తరగతి గదులు సరిపోక విద్యార్థులు ఇరుకు గదుల్లోనే చదువు కొనసాగించాల్సి వస్తోంది.

త్వరగా పూర్తి చేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో నాడు- నేడు ద్వారా చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి అదనపు గదుల్లేక చెట్ల కింద, వరండాల్లో విద్యార్థులకు బోధిస్తున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మొదటి విడతలో నాడు- నేడు పనులను పూర్తి చేశారు. రెండో విడత కూడా 60 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను కూటమి ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలి.

– ఎం.రవి కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ, వేంపల్లె

నిధులు రాగానే పూర్తి చేస్తాం



మండలంలో పాఠశాలల నూతన అదనపు తరగతి గదుల భవన నిర్మాణాలు పురోగతి గురించి ఉన్నతాధికారులకు తెలియజేశాం. ప్రధానంగా ఇడుపులపాయ, బక్కన్నగారిపల్లె, వేంపల్లె, ముత్తుకూరు తదితర గ్రామాల్లో నిధుల్లేక నిలిపివేయడం వాస్తవమే. త్వరలోనే భవన నిర్మాణాలు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తాం. నిధులు మంజూరు కాగానే పనులు వేగవంతం చేస్తాం.

– జాఫర్ సాధిక్, ఎంఈఓ, వేంపల్లె

ఆత్మస్థైర్యంతో పయనించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు

పులివెందుల టౌన్ : దివ్యాంగులు కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ప్రగతి పథంలో పయనించాలని మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్ ఆకాంక్షించారు. సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాలను పురస్కరించుకుని పులివెందుల పట్టణం ముద్దనూరు రోడ్డులోని దివ్యాంగుల కమ్యూనిటీ భవనంలో దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా వరప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగుల స్ఫూర్తి ప్రదాతలు లూయిా బ్రెయిల్, హెలెన్ కెల్లర్ చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సింగిల్ విండో ఈశ్వరయ్య సమకూర్చిన లగేజి ట్రాలీ బ్యాగులను దివ్యాంగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో ఈశ్వరయ్య కుమారుడు శివశంకర్, దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథ రెడ్డి, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవం

చింతకొమ్మదిన్నె : మండలంలోని మూలవంకలోని భవిత కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంఈఓలు వెంకటరామిరెడ్డి, రమాదేవి మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలను భవిత విద్యాలయంలో చేర్పించడం వలన విద్యతోపాటు స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, ఇతర అలవెన్సులు కల్పిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉధ్యాయులు, విద్యార్థులు, స్పీచ్ థెరపిస్టు, ఫిజియోథెరపిస్టు భాను, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

పులివెందుల టౌన్ : ఇటీవల కురుసిన వర్షాలతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ఇక్కడ, అక్కడ అనే తేడా లేకుండా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో పులివెందుల మున్సిపల్ అధికారులు దోమలను నియంత్రించేందుకు చర్యలు ప్రారంభించారు. పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట వార్డు సచివాలయ పరిధిలో సోమవారం సాయంత్రం దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ రాముడు ఆదేశాల మేరకు శానిటరీ సెక్రటరీ సుగుణాకర్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బంది వాహనాల ద్వారా పొగ మందు వదిలారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

జమ్మలమడుగు రూరల్: మైలవరం మండలం వేపరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. సోమవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల నియంత్రణలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బాలయ్య మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వలన యువత భవిష్యత్ నాశనమవుతుందన్నారు. ప్రతి ఒక్కరు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని కోరారు. గంజాయి, డ్రగ్స్ అరికట్టడానికి విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయుడు జి. నరసింహులు, అమృత సేవా సంఘం వ్యవస్థాపకులు మొయినుద్దీన్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

సింహాద్రిపురం : బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ ఖాదర్‌వలి పేర్కొన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న పాతపల్లెకు చెందిన ఇద్దరు వ్యక్తులను ఏఎస్ఐ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

జమ్మలమడుగు: విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే ఆపాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ కూమిటీ అధికారంలోనికి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని హామీ ఇచ్చారని, అధికారంలోనికి వచ్చిన ఆరునెలల్లోనే ప్రజలపై రూ. 6,072 కోట్ల రూపాయల భారం మోపారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఘనంగా మల్లేలమ్మ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో మల్లేలమ్మ

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీలో సోమవారం మల్లేలమ్మ తల్లి వార్షికోత్సవం ఘనంగా సాగింది. ఉదయం 7గంటలకు గణపతి పూజతో మొదలై పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి దంపతులు, ట్రిపుల్ ఐటీ మాజీ డైరెక్టర్ కుమారస్వామి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్నపిల్లలచే కోలాట భజన అందరిని ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారికి ఉంజాల్ సేవ నిర్వహించి క్యాంపస్ పురవీధుల గుండా ఊరేగించారు. అమ్మవారి వెంట బాణసంచా పేల్చుతూ భక్తులు సందడి చేశారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్, అకడమిక్ డీన్ రత్నకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు దీప్తి, కోటేశ్వరి, అధ్యాపకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారమే ఆరోగ్యానికి మార్గం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత

వేంపల్లె : పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ సునీత పేర్కొన్నారు. కౌమార దశలో రక్త హీనతను నివారించేందుకు బాలికలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. సోమవారం స్థానిక ఏపీ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు లైంగిక వేధింపులకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లైంగిక వేధింపులకు గురి అయితే 1098 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. పిల్లలకు కూడా జీవించే హక్కు, సమానత్వపు హక్కు, చదువుకునే హక్కు, భద్రత, సంరక్షణ హక్కులు ఉన్నాయని, వారి హక్కులను రక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమాజంపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుగుణమ్మ, ఉపాధ్యాయులు అయేషా భాను, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న, విద్యార్థినులు పాల్గొన్నారు.

పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



వర్షానికి దెబ్బతిన్న మినుము పంటను పరిశీలిస్తున్న ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి

వేంపల్లె : రైతులు సాగు చేసిన పంటలు అకాల వర్షం కారణంగా దెబ్బతిన్నాయని, పంటనష్టాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని పులివెందుల వ్యవసాయ శాఖ ఏడీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కత్తులూరు గ్రామంలో సాగు చేసిన మినుము, శనగ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు సాగు చేసిన మినుము, శనగ పంటలు పూర్తి దెబ్బతిన్నాయని, రైతులకు పరిహారం వచ్చేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రకృతిలో మార్పు రావడం వలన మినుము పంటకు తెగులు సోకిందన్నారు. మినుము పంట డివిజన్ పరిధిలో 5 వేల ఏకరాల్లో సాగు చేశారని, అలాగే శనగ పంట 20 వేల ఎకరాల్లో సాగు చేశారని పేర్కొన్నారు. పురుగు మందులపై 18 శాతం జీఎస్టీ లేకుండా చేయాలని రైతులు అధికారులను కోరారు. పంటల ప్రీమియం ఈ-క్రాప్‌కు సంబంధం లేకుండా చేయాలని కోరారు. మండల వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు తెగుళ్లు ఆశించాయని, వాటి నివారణకు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఏఓ శివమోహన్‌రెడ్డిని రైతులు కోరారు. సోమవారం రైతులు మండల వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డితో ఫోన్‌లో సంప్రదించారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ బుడ్డ శనగ పంటకు పచ్చ పురుగు, జొన్న పంటకు కత్తె పురుగు, ఉద్ది పంటకు లద్దె పురుగులు ఆశించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అలాగే వర్షాలతో బుడ్డశనగ పంట ఎర్రగా మారి వైరస్ బారిన పడిందన్నారు. పంటలకు ఆశించిన తెగుళ్లను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. త్వరలో తెగుళ్లు ఆశించిన పంటలను పరిశీలిస్తామని ఏఓ తెలిపారని రైతులు పేర్కొన్నారు.

రబీలో ఉద్యానవన పంటలకు బీమా



మాట్లాడుతున్న ఉద్యానవనశాఖాధికారి జ్యోతిర్మయి

చింతకొమ్మదిన్నె : రబీ సీజన్‌లో ఉద్యానవన పంటలకు 2024-25 ఏడాదికి గాను పీఎంఎఫ్‌బీవై ద్వారా బీమా పొందవచ్చునని ఉద్యానవన శాఖ అధికారి కె.జ్యోతిర్మయి అన్నారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో సోమవారం మామిడి రైతులతో ఉద్యాన శాఖ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కే.జ్యోతిర్మయి మాట్లాడుతూ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా అనే సంస్థ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల సహకారంతో కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతో పంట నష్టం జరిగితే ఆర్థిక నష్టాల నుంచి రైతులను ఆదుకునేందుకు ఈ పంటల బీమా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మామిడి పంటకు ఈ నెల 15లోగా ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు. ఎకరాకు రూ.2,200 ప్రీమియం చెల్లిస్తే, పంటనష్టపోతే, రూ.44వేలు వరకు బీమా వర్తిస్తుందన్నారు. బీమా చెల్లించే రైతులు బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, పంట వేసినట్టు ధ్రువీకరణ పత్రం జిరాక్సులు ఉండాలన్నారు. ప్రీమియం చెల్లించి బీమా చేయించుకుంటే ఈ ఏడాది డిసెంబర్ 15 నుంచి వచ్చే ఏడాది మే 31వరకు పంట బీమా వర్తిస్తుందని తెలిపారు. ఉద్యాన శాఖ అధికారి రెడ్డయ్య, వ్యవసాయ అధికారి ఈశ్వర్ రెడ్డి, కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మానస పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

జమ్మలమడుగు రూరల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత ఆకాంక్షించారు. సోమవారం జమ్మలమడుగు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రామిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే హాస్టల్‌ను ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డితో కలసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని ఆదినారాయణరెడ్డి సూచించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గ ఆర్డీఓ ఆదిమూలం సాయిశ్రీ, తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

జమ్మలమడుగు: ప్రభుత్వాధికారులు, రెవెన్యూ అధికారులు భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లె గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధికారులు గ్రామాలకు వచ్చినప్పుడు ఇక్కడే పరిష్కరించుకోవాలన్నారు. భూపేష్ సుబ్బారామిరెడ్డి, సీఐ లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

దళితులకు రెండు ఎకరాల భూమి ఇవ్వాలి

జమ్మలమడుగు: దళితులకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని గిరిజన, దళిత, డప్పుకళాకారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో దళిత, గిరిజన, సీపీఐ పార్టీ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అర్హులైన దళితులకు, గిరిజనులకు రెండు ఎకరాల సాగు భూమి ఇస్తామని ప్రకటించారని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్న దళిత, గిరిజనుల రాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అర్హులైన దళితులందరికీ అసైన్డ్ కమిటీ ఏర్పాటు చేసి రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మునెయ్య, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, డప్పుకళాకారుల సంఘం కార్యదర్శి నాగేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంకర పోశారు.. తారు మరిచారు



కంకర పోసి వదిలేసిన వద్దిరాల- దబ్బుడుపల్లె రోడ్డు

జమ్మలమడుగు రూరల్: వద్దిరాల- దబ్బుడుపల్లె రహదారిలో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. రోడ్డు నిర్మాణం భాగంగా కంకర వేసి తారు వేయడంతో మరిచారు. ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో నెల రోజుల క్రితం 15 కిలోమీటర్ల రోడ్డులో 30 చోట్ల కంకర పోసి వదిలేశారు. కంకర రోడ్డుపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు. పనుల పూర్తిచేసే విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ చొరవ చూపడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

వైభవంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



వైఎస్ మధురెడ్డికి కేక్ తినిపిస్తున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప



మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌ను సన్మానిస్తున్న పాస్టర్ల అసోసియేషన్ సభ్యులు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని స్థానిక చెన్నారెడ్డి కాలనీలో ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంలో సోమవారం పులివెందుల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలతో పాటు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, సతీమణి వైఎస్ భారతమ్మ జన్మదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ నాయకులు వైఎస్ మధురెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప, పులివెందుల అర్బన్ సీఐ టి.నరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి ప్రజలకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ వైఎస్ భారతమ్మ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మినీ క్రిస్మస్ సెలబ్రేషన్స్‌కు సహాయ సహకారాలు అందించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని ప్రతీ ఒక్కరు పొరుగు వారిపై ప్రేమ, అప్యాయతను కనబరచాలన్నారు. ఏసు చూపిన మార్గం ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లి విరుస్తుందన్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులకు నూతన వస్త్రాలను బహూకరించి అతిథులకు ఘనంగా విందు భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ ప్రశాంత్, పాస్టర్ ఉదయ్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ దేవరాజు, సెక్రటరీ పాస్టర్ కృపరాజు, క్రైస్తవులు, పట్టణంలోని ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.